క్లుప్తంగా

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

కాళోజీ సెంటర్: దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా సంక్షేమాధికారి జె.హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల నాలుగో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ ఉంటుందని ఆమె తెలిపారు.

24 నుంచి పరీక్షలు

కాళోజీ సెంటర్: గిరిజన సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-1, గ్రేడ్-2, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ, బీసీ సంక్షేమ శాఖలో వార్డెన్ గ్రేడ్-1, గ్రేడ్-2, మ్యాటిన్ గ్రేడ్-1, గ్రేడ్-2 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24 నుంచి 29 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు కనీసం గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షకు అర గంట ముందే కేంద్రాల గేట్లు మూసివేయనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు శనివారం నుంచి టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

పలకలు, బలపాల పంపిణీ



విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆరవ తరగతి విద్యార్థినులకు పలకలు, బలపాలను హెచ్‌ఎం ఉమా చేతుల మీదుగా హిందీ స్కూల్ అసిస్టెంట్ రాములు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ సబ్జెక్టు ఆరవ తరగతి నుంచి ప్రారంభమవుతున్న క్రమంలో హిందీ వర్ణమాల నేర్చుకోవడం కోసం పలకలు, బలపాలను ఉచితంగా అందజేసినట్లు వివరించారు.

అగ్ని మినిస్ట్రీస్ వార్షికోత్సవం



కాశిబుగ్గ: వరంగల్ లక్ష్మీపురం అగ్ని పెంతుకోస్తు ప్రార్థన మందిరంలో అగ్ని మినిస్ట్రీస్ 32వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ ఎస్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ స్పీకర్ డాక్టర్ శాలెం విక్రాంత్ వర్దన్ హాజరై ప్రసంగించారు. వేడుకల్లో సంఘ పెద్దలు నర్రా సాగర్, పోలెపాక జాన్సన్, మార్క్, పసునూరి యాకోబ్, కొంగర కుమార్, సతీష్, సురేష్, సుజిత్, ఆదిత్య, పాస్టర్లు యాకోబ్, సువర్ణ రాజు, కాలేబు, ఆరోగ్యం, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడిలో పూజలు

ఖిలా వరంగల్: వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలోని పోచమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జేష్ఠమాసం పౌర్ణమి సందర్భంగా ఆలయ పూజారి రమణాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి శుక్రవారం అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, తరగల శ్రీధర్‌బాబు, ఉదయ్‌కుమార్, సారంగపాణి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం తెట్టె సునీల్(36) దినసరి కూలీగా పనిచేస్తూ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం చేయించినప్పటికీ నొప్పి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఇంటిలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జె.సురేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఐదు రోజుల పాటు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఎస్సై లవన్ కుమార్ కథనం ప్రకారం హనుమకొండ రాంనగర్ ప్రాంతానికి చెందిన ఎండీ.నసీర్ (47) మార్బుల్ టైల్స్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై కాజీపేట నుంచి ఫాతిమా నగర్ 100 ఫీట్ రోడ్డులోకి వెళ్తుండగా వేగంగా వచ్చిన లారీ అతన్ని ఢీకొట్టింది. దాంతో నసీర్ తీవ్రంగా గాయపడగా ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అతడు మృతి చెందాడు. మృతుడి భార్య అంజుమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లవన్ కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో యోగా దినోత్సవంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా



హసన్‌పర్తి: యోగాసనాలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు



కేయూలో రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ప్రొఫెసర్లు, విద్యార్థులు



అంతర్జాతీయ యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. యోగా గురువుల సమక్షంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. నిత్యం యోగా సాధనతో రోగాలు దరిచేరవని చెప్పారు.

\- సాక్షి నెట్‌వర్క్



నిట్‌లో యోగా డే వేడుకలు



వరంగల్ కృష్ణకాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో యోగా సాధనలో విద్యార్థులు



హనుమకొండ ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో..



న్యూ కొటిల్యాస్ హైస్కూల్‌లో..



మడికొండలోని మాస్టర్జీ పాఠశాలలో..



కాజీపేట వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌పై..



కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్స్ హైస్కూల్‌లో..



కాశిబుగ్గ బాలజ్యోతి హైస్కూల్‌లో..



గిర్మాజీపేట గోమతి పబ్లిక్ స్కూల్‌లో..



హసన్‌పర్తి: ఆర్యసమాజ్‌లో..



హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదాన శిబిరం



హన్మకొండ అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ (ఎస్‌బీఐఎస్‌యూహెచ్‌సీ) యూనియన్ డే సందర్భంగా సంఘం వరంగల్ అర్బన్, రూరల్ రీజియన్ల ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌బీహెచ్ నక్కలగుట్ట బ్రాంచ్‌లో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 37 మంది యూనియన్ సభ్యులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ వై.సతీష్‌కుమార్, ఏజీఎస్ సంతోష్‌కుమార్, రాజేందర్‌సింగ్, ట్రెజరర్ రవీందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమారస్వామి, వరంగల్ అర్బన్ ఆర్‌ఎం విష్ణువర్ధన్, వరంగల్ రూరల్ ఆర్‌ఎం అబ్దుల్ రహీం, బ్రాంచ్ మేనేజర్ డి.సంపత్ పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ ప్రస్తుత సర్టిఫికెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలి

నయీంనగర్: టీఎస్‌పీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో ప్రస్తుత సంవత్సరం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ప్రగతి సింగారం రెడ్డి సంఘం సభ్యుడు గంగాడి యాదవరెడ్డి కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ 2022, డిసెంబర్‌లో పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి 2024లో పరీక్షలు నిర్వహించిన అనంతరం ఇప్పుడు 2021 -22కు సంబంధించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ అడుగుతున్నారని, ఇది ఎలా సాధ్యమవుతుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సమావేశంలో ప్రతాప్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, కరుణాకర్, సాంబరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’పై ప్రధాని మోదీ స్పందించాలి



నిరసన తెలుపుతున్న డీవైఎఫ్‌ఐ నాయకులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) హనుమకొండ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీని నిరసిస్తూ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కిషోర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుచందర్, జిల్లా సహాయ కార్యదర్శులు సురేష్, చిరంజీవి, జిల్లా కమిటీ సభ్యులు మొలుగూరి అశోక్, సతీష్, కరుణాకర్, సముద్రాల అనిల్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కేయూ క్యాంపస్: వైద్యవిద్య ప్రవేశాలకు దేశవ్యాపితంగా నిర్వహించిన నీట్ ప్రశ్నపత్రాల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నీట్ అవకతవకలపై ప్రధాని మోదీ స్పందించాలని నిరసిస్తూ మోదీ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. కార్యక్రమంలో డీఎస్‌యూ కేయూ కార్యదర్శి మర్రి మహేష్, నాయకులు నర్సింహ, సూర్య, సందీప్, శివ, శేఖర్, తరుణ్ పాల్గొన్నారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

కేయూ క్యాంపస్: నీట్ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ రాజీనామా చేయాలని కేయూ బీఆర్‌ఎస్‌వీ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్ డిమాండ్‌చేశారు. కేయూలోని పరిపాలన భవనం వద్ద రాణిరుద్రమ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. డాక్టర్ పాలకుల కొమురయ్య, ఉషస్‌నాయక్, దేవేందర్, ఆల్‌మాల స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండు సురేష్, ప్రభాకర్, తిరుపతి, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవరెడ్డి

వరంగల్: తెలంగాణ పొదుపు, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం బలోపేతానికి, మ్యాచింగ్ గ్రాంటు ఇప్పించేందుకు కృషి చేస్తానని జిల్లా సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి అన్నారు. గిర్మాజీపేటలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన సంఘం మొదటి వార్షికోత్సంలో సంజీవరెడ్డితో పాటు చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమేష్ బాబు, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ మండల పరశురాములు, స్థానిక కార్పొరేటర్ చింతాకుల సునీల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బిట్ల కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీఓ సంజీవరెడ్డి మాట్లాడుతూ సంఘం ఏర్పాటు చేసిన ఏడాదిలోనే రూ.15 లక్షలను పొదుపు చేయడం సభ్యుల నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. పొదుపు సంఘాలకు సుమారు రూ.2,200 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్లు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. సంఘం నాయకులు పాపని భాస్కర్, సామల రాజు, సూరయ్య, మురళి, ప్రకాష్, శేఖర్, మహేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక రక్షణ



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యేలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

హన్మకొండ అర్బన్: శారీరక, మానసిక ఆరోగ్య రక్షణ, ఒత్తిడి నివారణకు యోగా చాలా ఉపయోగపడుతుందని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ఆయుష్, యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్య శారదాదేవి, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఆయుష్ ఆర్‌జెడీ రవినాయక్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను రోజువారీ జీవన విధానంలో భాగం చేసుకోవాలని, క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. కనీసం రోజు పది నిమిషాలు ధ్యానం చేసే రోజంతా మానసికంగా, శారీరకంగా హుషారుగా ఉంటారన్నారు. యోగా విశిష్టతను ప్రపంచ దేశాలు గుర్తించాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కాశిబుగ్గ: ప్రతిరోజూ యోగా చేస్తే అనారోగ్య సమస్యలు దూరం కావడంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి అన్నారు. జిల్లా యువజన క్రీడలు, ఆయుష్ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఓ సిటీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ సత్య శారదాదేవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా దినోత్సవాన్ని ప్రారంభించి ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ప్రాచీన సంప్రదాయం నుంచి మనకు లభించిన అమూల్యమైన కానుక యోగా అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీసీఓ సంజీవరెడ్డి, డీపీఆర్‌ఓ ఎండీ అయూబ్‌అలీ, వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌కుమార్, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, డీవైఎస్‌ఓ సత్యవాణి, జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్, పరిశ్రమల శాఖ జీఎం నరసింహమూర్తి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, ఆయుర్వేద హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్ డాక్టర్ సాంబమూర్తి పాల్గొన్నారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



హసన్‌పర్తి: జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



ఖిలా వరంగల్: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని భీమారం, ముచ్చర్ల, హసన్‌పర్తి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రజనీకుమార్, రైతు బంధు సమితి జిల్లా మాజీ కార్యవర్గ వర్గ సభ్యుడు విక్టర్‌బాబు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకపు శ్రీనివాస్, దేవస్థాన మాజీ చైర్మన్ లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకుడు ఆకుల కుమార్ పాల్గొన్నారు.

ఉర్సు కరీమాబాద్‌లో..

ఖిలా వరంగల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో మైనార్టీ కాంగ్రెస్ నేత షేక్ మున్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ఓబీసీ సెల్ నేత గందె సునీల్, సాంబయ్య, బాబా, రాజు, ఇస్మాయిల్, నవీన్, సజ్జత్, మీర్జా హైమద్‌బేగ్ పాల్గొన్నారు.

రైల్వే వైద్యులకు సన్మానం



కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రి డీఎంఓగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కె.వినయ్‌బాబును రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కమర్షియల్ అండ్ ఆపరేటింగ్ బ్రాంచ్ నాయకులు శుక్రవారం సన్మానించారు. భద్రాచలం రైల్వే ఆస్పత్రి నుంచి కాజీపేటకు వినయ్‌బాబు బదిలీపై వచ్చారు. అలాగే, స్థానిక రైల్వే డీఎంఓ డాక్టర్ హరిబాబును కమర్షియల్ అండ్ ఆపరేటింగ్ బ్రాంచ్ సెక్రటరీ కేఎస్.రావు ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఆర్.కుమారస్వామి (రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్) బి.జకరయ (రైల్వే టీటీఐ) పి.రంగయ్య (సీసీటీసీ) మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందన

హసన్‌పర్తి: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా మూడవ సారి నియమితులైన రౌతు రమేష్‌ను పలు పార్టీలకు చెందిన నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, మాజీ సర్పంచ్ దావ రవి, కాంగ్రెస్, మాల మహానాడు మండల అధ్యక్షుడు పోతరాజు ప్రభాకర్, బీజేపీ నాయకుడు పప్పుల రమేష్, బీఆర్‌ఎస్ నాయకుడు దండి సాంబయ్య, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కలెక్టర్‌కు టీఎస్ యూటీఎఫ్ శుభాకాంక్షలు

విద్యారణ్యపురి: హనుమకొండ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ప్రావీణ్యను టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రాజు, పెండెం రాజు, జిల్లా కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి మోజెస్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ‘పింగిళి’ అధ్యాపకులు



హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ పి.ప్రావీణ్యను నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, రేణుక, మాధవి, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ రాధిక, శిరీష, సురేష్, తదితరులు ఉన్నారు.

యూనివర్సిటీ కళాశాలలో స్వచ్ఛభారత్

కేయూక్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిచారు. ఈ సందర్భంగా చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నిరంజన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్యాంకు సహకారం అవసరం



వరంగల్: పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే వ్యాపారుల అభివృద్ధికి బ్యాంకు సహకారం ఎంతో అవసరం అని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ అలంకార్ రోడ్డులో శుక్రవారం ఏర్పాటు చేసిన తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు లిమిటెడ్ కొత్త బ్రాంచ్‌ను రవీందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లోని వ్యాపారులకు అండగా ఉంటే బ్యాంకు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, కోశాధికారి అల్లె సంపత్, కార్యవర్గ సభ్యులు, పలు సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్య తీసుకోవాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలను మూసివేయించాలని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఎస్‌ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, మహేందర్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో..

కేయూ క్యాంపస్: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఏబీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షుడు చరణ్, బాధ్యులు భరత్, అశోక్, కిరణ్, నవీన్, సురేష్, వినయ్, నాగరాజు, మంజునాథ్, జితేష్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఆయిల్‌బాల్స్ వేస్తున్న కార్పొరేటర్, తదితరులు

ఖిలా వరంగల్: ఖాళీ స్థలాల్లో మురుగునీరు ఉండకుండా ప్రజలు చూసుకోవాలని, మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మరుపల్లి రవి తెలిపారు. వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో బల్దియా మలేరియా విభాగం ఆధ్వర్యంలో మురుగు కాల్వల్లో శుక్రవారం ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకునే బాధ్యత స్థానికులదేనని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, స్థానికులు అవునూరి కృష్ణమూర్తి, అవునూరి సునీత, వరలక్ష్మి, యాకూబ్, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్ల బావిని సుందరంగా తీర్చిదిద్దుతాం



ఖిలా వరంగల్: జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే స్థాయిలో మూడు అంతస్తుల మెట్ల బావిని రూ.50 లక్షల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దుతామని 34వ డివిజన్ కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి అన్నారు. శివనగర్‌లోని చారిత్రక మెట్ల బావి అభివృద్ధి, సుందరీకరణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్‌లోని బన్సిలాల్‌పేట ఐదంతస్తుల మెట్ల బావి తరహాలో దీన్నికూడా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. బావికి మరమ్మతులు, పూడిక, స్లాప్ వేసిన అనంతరం పూల వనంతోపాటు గార్డెనింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బజ్జూరి అంజయ్య, బిల్లా రాజు, కొత్తగట్టు శ్యామ్, వంగర సతీష్, ఇందిర పాల్గొన్నారు.